# ఈ డబ్బెవరిది?

బెజవాడ స్టేషనులో ఏలూరు నుంచి వచ్చే అయిదుగంటల పాసెంజరులో ఒక పెద్దమనిషి దిగాడు. ఆయన వయసు యాభై అయిదుకు తక్కువ వుండదు. అయిదడుగుల పైన అట్టే వుండడు. బట్టతల; చెవులమీదిగా నామకార్థం నాలుగేసి నెరిసిన వెండ్రుకలున్నాయి. కళ్ళకు చూపుకూ, చదువుకూ కూడా పనికొచ్చే పెద్ద సులోచనాల జోడు, కొమ్ము చట్రంతో సహా. మీసాలూ, గడ్డమూ అప్పుడే తుడిపించినంత పరిశుభ్రంగా వుంది మొహం. నల్లచారల తెల్లకోటు వేసుకున్నాడు. కోటు గుండీలు పెట్టుకోలేదు. అందుచేత కనబడుతున్న లోపలి చొక్కా కూడా ఆ విధంగానే గుండీలు పెట్టని కారణం వల్ల ఆయన వక్షస్థలం మీద నెరుస్తూ నెరుస్తూ ఉన్న దుబ్బును బహిరంగ పరుస్తున్నది. ఆయన ఒక చేతిలో పేపరూ మరో చేతిలో తోలు చేతి పెట్టే పట్టుకుని ఎన్నడూ ఆ స్టేషనులో దిగనివాడల్లే అటూ ఇటూ చూస్తూ నడవటం మొదలుపెట్టాడు.

'ఓవరు బ్రిడ్జి' మీద మొదట తన్ను "గోర్నర్ పేటకి ఝట్కా మహ్రాజ్!" అన్న సాయిబును స్వీకరించాడా పెద్దమనిషి. బేరం కుదరగానే సాయిబుముందు పరిగెత్తటం చూసి ఆయన వాణ్ని వెనక్కు పిలిచి తనవెంటనే నడిపించి వాణ్ణి సంభాషణలో దించాడు.

"ఈ ఊరు చాలా మారింది!" అన్నాడు పెద్దమనిషి.

కిందటిసారి ఆ ఊరొచ్చి ఎంతకాలమైందన్నాడు సాయిబు. ఇరవై ఏళ్లై వుండవచ్చును. పదిహేనైనా తప్పకుండా అయి ఉంటుంది. లెక్క పోయిందన్నాడు పెద్దమనిషి. సాయి బాశ్చర్యపడి ఇంత కాలం నించీ ఎక్కడుంటున్నారన్నాడు. డబ్బు దొరికిన చోటల్లా ఉంటున్నానన్నాడు పెద్దమనిషి. అని వెంటనే, 'అయితే, సాయిబూ! నా దగ్గిర చాలా డబ్బుంది. ఆ డబ్బు ఎవరిదో నువ్వేమయినా చెప్పగలవా? నాకు తెలీలేదు! చాలారోజుల్నించీ ఆలోచిస్తున్నాను."

సాయిబు నిర్ఘాంతబోయి చూశాడు.

"పోనీ, నీక్కూడా తెలీకపోతే!" అంటూ పెద్దమనిషి బండిలో యెక్కాడు.

"ఓ! ఎప్పుడొచ్చావు. మామయ్యా! ఎక్కడుంటున్నావు? ఏమి చేస్తున్నావు? నువ్వున్నావో పోయినావో కూడా తెలీలేదు మాకు!.... ఏమేవ్, రంగారావు మామయ్యొచ్చాడు.

కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళియ్యవే!... కూర్చో మామయ్యా!" అన్నాడు చలపతి కల్తీలేని ఉత్సాహంతో.

"నేను ఎంతమాత్రం కూర్చోను!" అన్నాడు రంగారావు చుట్టూ కలియ చూస్తూ. "ఈ ఇల్లేమిటి? ఈ దారిద్ర్యమేమిటి? నీ అవతారమేమిటి? ఆ జుట్టు కత్తిరించి ఎన్నేళ్ళయింది? నువ్వాంధ్ర పత్రికలో ప్రకటించిన "నాగరికత" అనే వ్యాసం చూసి - నువ్విట్లా వున్నావనుకోలేదు!" ఇంతలో చలపతి భార్య కాళ్ళు కడుక్కునేటందుకు నీళ్ళు తెచ్చింది. "ఈ పిల్లనీ - నీ భార్యా? ఈ దారిద్ర్యానికి తోడు పిల్లలు కూడా?"

"లేదు!" అన్నాడు చలపతి గట్టిగా, పైన ఏమనాలో తెలీలేదు.

అంతవరకు చేతిలోనే పట్టుకుని వున్న తోలు పెట్టెను రంగారావు గారు మెల్లిగా కిందబెట్టి "భోజనానికుండను. స్నానం చేసేందుకు."

"కొళాయి వుంది!"

"సరే. నేను తిరిగి పోవాలి నా కెన్నింటికి బండి వుంది?"

"అప్పుడే? ఇక్కడెందుకు భోజనం చెయ్యవు?"

"నా కెట్లా తిండి పెట్టగలవు - ఈ బీదరికంతో."

"మేం తినే పచ్చడి మెతుకులే.."

"నాకు సయించవు! బండీ ఎప్పుడు?"

"ఇప్పుడెక్కడికి పోతావు?"

"పదిహేను సంవత్సరాల నుంచీ దేశాటన చేస్తున్నవాణ్ణి. ఎక్కడికి పోతావంటే అర్థమేమిటి? ఎక్కడికి పోలేను? ఏలూరు పోవాలి ముందు!"

"పదకొండు గంటలకు బండి ఉంది. ఏలూరు చేరేటప్పటికి.."

"ఫరవాలేదు, హోటలెక్కడుంది?"

"దగ్గిరలోనే వుంది."

"అయితే స్నానం చేస్తాను!"

"హోటల్లో భోజనం బాగుందా, మామయ్యా?"

"బాగూ! పావలాకు పెడతానని ఆ అరవ్వాడనేటప్పటికి బాగుండదని అప్పుడే అనుకున్నాను. ఆ తిండి ప్రతిరోజూ తింటే నెల రోజుల్లో ఎటువంటివాడికైనా రోగం వస్తుంది. మొదటినించీ ఆ తిండే తినేవాడైతే అరవై సంవత్సరాల పైన బతకటం అసంభవం!... నువ్వేమీ సంపాదన మొదలు పెట్టలేదేం?"

"సంపాదించకేం?"

'మరి - ఇదంతా యేమిటి?" రంగారావుగారు చుట్టూ చూపించాడు.

"సంపాదించక పోవటం కాదు. అవసరమయిన ఖర్చు! కాఫీహోటళ్ళూ, సిగిరెట్లూ, సినిమాలూ!"

"నీ సంపాదన?"

"యాభై!"

"యాభయ్యా? వారానికా?"

"ఇక్కడ నెల జీతాలే! నువ్వంతా మరిచిపోయినట్టున్నావు!"

"పూర్తిగా!... నెలకు యాభయ్యా? ఎట్లా బతుకుతున్నావు?"

"చూస్తున్నావుగా! నా అవస్థ వర్ణనాతీతం. ఈ యాభై రూపాయలతో ఎంతకాలం ఆదా చేస్తే నేను ఆంధ్రపత్రికలో చెప్పిన ప్రకారం జీవితం గడపగలను? అద్దంలో చూసుకుంటే నన్ను నేను గుర్తుపట్టలేను. ఈ యిల్లు నాదని అనిపించదు. నేను తినే తిండి నా దల్లే వుండదు. దుర్వ్యయం చేస్తున్నానని చాలా మంది కోప్పడ్డారు. నేనేం చెయ్యను? వారానికి రూపాయిన్నర సంపాదించే కూలి వాడు రూపాయి తాగేయటం ఎందుకో నాకు తెలుసును. పై ఖర్చు తగ్గిస్తే ఇంతకన్న మంచి తిండీ, మంచి బట్టలూ, మంచి కొంపా దొరక్కపోవు. అప్పుడద్దంలో నన్ను నేను గుర్తు పట్టుకోగలనేమో. కాని నా నిజమైన రూపం చూసుకోవటం మొదలుపెట్టిన తరవాత మనస్సు ఆపగలవా? నేను సంపాదించేది యాభై మించలేదని తేలిపోయింది. నాకు కనీసం నెలకు ఆరు వందలైనా ఉంటే తప్ప చాలవు! నడిమధ్య వేళ్ళాడటం మరీ దుర్భరమౌతుందని ఈ విధంగా అజ్ఞాతవాసం చేస్తున్నాను. నెల కారువందలు ఖర్చు చెయ్యటం వీళ్ళకర్థంకాదు! చెబితే పిచ్చెత్తిందనుకుంటారు. అంత సంపాదిస్తున్న వాళ్ళు కూడా ఉన్నారు. ఈ ఊళ్ళోనే. వాళ్ళకు దాంతో ఏం చేయాలో తెలీదు! వాళ్ళ డబ్బు చూసినప్పుడల్లా ఇది వాళ్ళది కాదు, న్యాయప్రకారం నాది అనుకుంటూ వుంటాను! (రంగారావుగారి కళ్ళు అకస్మాత్తుగా జ్యోతులల్లే ప్రకాశించటం మొదలు పెట్టినయి.) నెల కారువందలు. ఇంకొకరి మీద ఆధారపడి సంపాదించటానికిక్కడ అవకాశం లేదు. లక్ష రూపాయలుంటే నా అంతట నేనే ఆరువందల చొప్పున సంపాదించుకోగలను... కాని, ఏం లాభం? నాలో అంత నమ్మకం ఏ లక్షాధికారికుంది? ఇట్లా కొంతకాలం గడిస్తే తాగుడు కూడా మొదలు పెడతానేమో అనుకుంటాను. చిత్రం వేస్తుంది! ఈ మృగాలు డబ్బెక్కువైన మీదట వ్యసనాల్లో చిక్కుకుంటై. అవసరం లేనివాడి దగ్గిర డబ్బు నిజంగా వ్యసనమే, విషమే! నాబోటి వాళ్ళున్నారని తెలియక డబ్బు పరానికి దూరమని చెబుతారు."

రంగారావుగారు చాలాసేపు మాట్లాడకుండా కూర్చున్నాడు.

"అనేకమంది నడిగాను. నా దగ్గిర చాలా డబ్బుంది. అది ఎవరిదీ తెలీలేదు. మీకు తెలుసునా?' అని. నిజంగా నా దగ్గిర డబ్బుంది. నాకు నిజంగా తెలీలేదు. కొందరు ఆ

డబ్బు నా దగ్గిర ఉండుటచేత నాదే నన్నారు. వీళ్ళు ముష్టిఎత్తే రకం. అట్లా అయితే నా దగ్గిరున్న ప్రతినోటు మీదా రాజు బొమ్మ ఉంది కనుక రాజుదేనా అన్నాను. కొందరు ఆ డబ్బు నా వారసులదన్నారు. ఆ సమాధానం కూడా నాకు నచ్చలేదు. నేను డబ్బు సంపాదించేటప్పుడు చేతనవును కనుక సంపాదించాను. కాని అవసరమైకాదు. నువ్వు చెప్పిన మాటలను బట్టి ఆ డబ్బు నీదేనని తోస్తుంది. అదంతా నీకే వదిలిపెట్టేస్తాను. నాకింకో యాభై సంవత్సరాలకు సరిపొయ్యేదుంచుకుని. రెండున్నర లక్ష ఉంది నాకవసరం లేని డబ్బు. అంత మొత్తం నీకూ అవసరం లేనట్టు తోస్తుంది. కనక నీ మనస్సును ఆ డబ్బుతో మిగిలేదాంతో ఎవరికవసరం ఉందనితోస్తే వారికివ్వ వచ్చును."

రంగారావు గారు చలపతికిచ్చిన దానిలో అతని కవసరమైన లక్షాపదివేలు పోగా ఇంకా లక్షాపాతికవేలు అట్లాగే ఉంది. కనక అది కావలసిన వాళ్ళు చేతులెత్తండీ!

***మొదటి ముద్రణ : ఆంధ్రభూమి, నవంబర్ 1934***